# విచిత్ర కథలు

**-సౌభాగ్య**



# త్యాగం

కురుసోవా పేదవాడు. కానీ మంచివాడు. దయార్ద్ర హృదయుడు. అతనికి పొలం లేదు. కూలి పని చేసి కుటుంబాన్ని పోషించేవాడు. అతనికి పిల్లలు లేరు. భార్య గయ్యాళి. డబ్బు తెమ్మని భర్తని పోరుతూ వుండేది. ఆమె మగ్గం నేసేది. ఒకసారి మగ్గంలో ఒక కండువా నేసి అది భర్త చేతికి ఇచ్చి దగ్గరున్న రేవుదగ్గరికి వెళ్ళి చేపలు పట్టేవాళ్ళకు అమ్మి మంచి చేపల్ని తీసుకురమ్మని చెప్పింది.

కురుసోవా సరేనని ఆ కండువా తీసుకుని దగ్గరే వున్న రేవు దగ్గరికి వెళ్ళాడు. అక్కడ ఒక మత్స్యకారుణ్ణి కలిసి ఆ కండువా తీసుకుని మంచి తాజా చేపల్ని పట్టివ్వమని కోరాడు. మత్స్యకారుడు సరేనన్నాడు. వల విసిరాడు. కాసేపటికి పెద్ద తాబేలు ఒకటి వలలో పడింది. జాలరి చేపల బదులు ఈ పెద్ద తాబేలును తీసుకో అన్నాడు. కురుసోవా ఆ తాబేలును చూశాడు. తాబేలు నెమ్మదిగా శాంతంగా కనిపించింది. పైగా తాబేలు దీర్ఘ కాలం జీవిస్తుందని, నిరపాయకరమయిందని అతనికి తెలుసు. అట్లాంటి తాబేలును నిర్దయగా చంపడానికి అతనికి మనస్కరించలేదు. కురుసోవా జాలరిని చూసి 'అయ్యా! మీరు నాకో సహాయం చెయ్యాలి. ఈ కండువా మీకు ఇచ్చేస్తాను. ఈ తాబేలును నాకు ఇవ్వాల్సిన పని లేదు. కాని దీన్ని సురక్షితంగా నీళ్ళలో వదిలేయండి' అన్నాడు. జాలరి చిత్రంగా చూసి సరేనన్నాడు. కండువా తీసుకుని తాబేలును నీళ్ళలో వదిలాడు. అది నెమ్మదిగా నీళ్ళలో సాగుతూ కృతజ్ఞతగా కురుసోవాను చూసింది. తాబేలును రక్షించగలిగినందుకు కురుసోవా ఆనందించాడు. 'నేను పేదవాణ్ణయినా నా కండువా తాబేలు మరిన్ని సంవత్సరాలు జీవించడానికి ఉపయోగపడింది. నాకదే చాలు'అని సంతృప్తిపడ్డాడు.

కురుసోవా ఒట్టిచేతుల్తో ఇంటికి తిరిగి వచ్చాడు. జరిగిన సంగతి భార్యకు చెప్పాడు. భర్త చేసిన పనికి ఆమె ఆగ్రహోదగ్రురాలయింది. నోటికి వచ్చిన తిట్లన్నీ వర్షంలా కురిపించింది. అంతటితో ఆగక చేతికొచ్చిన వస్తువులన్నీ అతనిపై విసిరింది. చివరికి ఒక దుడ్డుకర్ర తీసుకుని గొడ్డును బాదినట్లు బాదింది. కురుసోవా ఆ దెబ్బలకు స్పృహతప్పి పడిపోయాడు. ఐనా ఆమె కసి తీరలేదు. అతను స్పృహతప్పి పడిపోయినా ఆమె ఆగకుండా దుడ్డు కర్రతో కొట్టి కొట్టి అలసిపోయింది. చివరికి అతను చనిపోయాడని తీర్మానించుకుని అతని కాళ్ళు పట్టి ఇంటి బయటకు ఈడ్చి రోడ్డుపక్కన పడేసింది. కురుసోవా అక్కడే మూడురోజులు పడి వున్నాడు.

నాలుగోరోజు ఎవరో ఒక రైతు ఎడ్లబండిలో ఆ దారంట వెళుతూ రోడ్డుపక్కన పడి వున్న కురుసోవాను బండిలో వేసుకుని పక్క గ్రామంలోవున్న ఒక వైద్యుని దగ్గరకు వెళ్ళాడు. ఆ వైద్యుడు కురుసోవా నాడి చూసి చనిపోయినట్లు నిర్ధారించాడు. ఆ రైతు భయపడి బండిని దూరంగా తోలుకెళ్ళి కురుసోవా శరీరాన్ని ఒక పొద దగ్గర వదిలేసి వెళ్ళిపోయాడు.

అరగంట తరువాత దారంట వెళుతున్న ఒక బౌద్ధ భిక్షువు ఆ పొద దగ్గరికి వచ్చి తన కమండలంలోని జలాన్ని కురుసోవా శరీరంపై చిలకరించి అదృశ్యమయ్యాడు. నిద్రలోంచి లేచినట్లు కళ్ళు నులుముకుంటూ కురుసోవా లేచి ఇటు అటూ చూశాడు. దూరంనించీ ఏవో మాటలు వినిపించాయి. 'నాకు నువ్వు ప్రాణదానం చేశావు. నీ త్యాగం నిరుపమానం. దానికిదే ప్రతిఫలం'. అదృశ్య వ్యక్తి అభిమాన వాక్కులకు కురుసోవా సంతోషపడ్డాడు. తాబేలుకు తను చేసిన సహాయానికి భగవంతుడు తన పట్ల దయగా ప్రవర్తించాడని కురుసోవా తలపోశాడు.

అంతలో ఇద్దరు బలమైన వ్యక్తులు ఒక అందమైన అమ్మాయిని పెడరెక్కలు విరిచి కట్టి లాక్కుపోతూ కనిపించారు. ఆ అమ్మాయి కన్నీరు మున్నీరుగా విలపిస్తూ కురుసోవాను చూసి రక్షించమని ఆక్రోశించింది. కురుసోవా వాళ్ళ దగ్గరకు వెళ్ళి 'ఎందుకా అమ్మాయిని బంధించి తీసుకెళుతున్నారు' అన్నాడు. ఆ అమ్మాయి తండ్రి వాళ్ళకు వంద బంగారు నాణేలు అప్పుపడి తిరిగి చెల్లించలేక బదులుగా ఆ అమ్మాయిని ఇచ్చివేసినట్లు వాళ్ళు చెప్పారు. కురుసోవా ఆకాశంలోకి చూసి 'భగవంతుడా! నా ప్రాణాలు తీసుకుని వంద బంగారు నాణేలు ఇచ్చి ఈ అమ్మాయికి విముక్తి కలిగించు' అని. దారిపక్కనే వాడిగా కత్తిలా వున్న ఒక రాయి కురుసోవాకు గుచ్చుకోవడానికి బదులు అతన్ని చక్కిలిగింతలు పెట్టింది. కురుసోవా గిలిగింతలు పెట్టినట్లు నవ్వాడు. అప్రయత్నంగా జరిగిన ఆ చర్యకు ఆ అమ్మాయిని బంధించిన బలమైన వ్యక్తులిద్దరూ ఆశ్చర్యంగా చూశారు. ఆ రాయి ప్రాణం వచ్చినట్లు లేచి ఆ బలమైన వ్యక్తుల వైపు వెళ్ళింది. దాన్ని చూసి వాళ్ళిద్దరూ భయంతో పరుగు లంగించుకున్నారు.

వాళ్ళు పరిగెత్తేకొద్దీ రాయికూడా వాళ్ళని అనుసరించింది. వాళ్ళు కనిపించనంత దూరం వెళ్ళిపోయాక కురుసోవా ఆ అమ్మాయి కట్లు విప్పాడు. ఆ అమ్మాయి కురుసోవా పట్ల కృతజ్ఞత ప్రకటించి తన ఇంటికి వెళ్ళనని, కురుసోవాతోబాటే వుంటానని అంది. కురుసోవా ఆ అమ్మాయి పెళ్ళిచేసుకొని దూర ప్రాంతంలో ఒక గ్రామంలో స్థిరపడి ప్రశాంతంగా జీవించారు. కురుసోవా మొదటి భార్య ఏమయిందో ఎవరికీ తెలీదు.

★

**కురుసోవా ఒట్టిచేతుల్తో ఇంటికి తిరిగి వచ్చాను. జరిగిన సంగతి భార్యకు చెప్పాడు. భర్త చేసిన పనికి ఆమె ఆగ్రహోదగ్రురాలయింది. నోటికి వచ్చిన తిట్లన్నీ వర్షంలా కురిపించింది. అంతటితో ఆగక చేతికొచ్చిన వస్తువులన్నీ అతనిపై విసిరింది. చివరికి ఒక దుడ్డుకర్ర తీసుకుని గొడ్డును బాదినట్లు బాదింది. కురుసోవా ఆ దెబ్బలకు స్పృహతప్పి పడిపోయాడు.**